క్లుప్తంగా

డ్రైనేజీ పనుల పరిశీలన



డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ముమ్మన దేముడు

సింహాచలం: జీవీఎంసీ 95వ వార్డు లక్ష్మీపురంలో చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను సోమవారం కార్పొరేటర్ ముమ్మన దేముడు పరిశీలించారు. పనులు త్వరితగతిన పూర్తిచేసి నిర్వాసితులకు ఇబ్బంది లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రమణ, గోవింద్, యూజీడీ అధికారులు పాల్గొన్నారు.

నమో శివరుద్రాయ



ఉమాచంద్రమౌళీశ్వరస్వామి

సింహాచలం: విజినిగిరిపాలెంలోని ఉమా చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో సోమవారం పరమేశ్వరుడికి విశేషంగా అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు విశేషంగా తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఉమాదేవి అమ్మవారికి కుంకుమపూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్ కృష్ణశర్మ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



నృత్య ప్రదర్శనలో విద్యార్థినులు

సింహాచలం: చినముషిడివాడలోని చాణిక్యనగర్ రామాలయంలో ఆదివారం రాత్రి స్థానిక నిర్మల నృత్యనికేతన్ విద్యార్థులు చేసిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. సీనియర్ విద్యార్థినులు సాయిపూజిత, నవ్యలతో కలిసి చిన్నారులు అద్భుతంగా అభినయం చేశారు. నృత్యనికేతన్ నిర్వాహకురాలు డాక్టర్ విజయజ్యోతి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

35 మందికి క్యాంపస్ కొలువులు



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న కంపెనీల ప్రతినిధులు

సింహాచలం: పెందుర్తి మండలం పినగాడిలో ఉన్న వెల్ఫేర్ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం జరిగిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 35 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఇంటర్నేషనల్ స్టీల్ డిటైలింగ్ సర్వీసెస్ ఎమేన్సీ కంపెనీ ప్రతినిధులు క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. మెకానికల్, సివిల్ విభాగాలకు సంబంధించి నిర్వహించిన ఇంటర్వ్యూల్లో 35 మంది ఎంపికైనట్టు కళాశాల పీడీ రమణరావు తెలిపారు. విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జాషువా, టీపీవో కిరణ్‌కుమార్ అభినందనలు తెలిపారు.

అప్పన్నను దర్శించుకున్న ఎమ్మెల్యేలు



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న గణబాబు దంపతులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామిని సోమవారం విశాఖ ఉత్తర, పశ్చిమ ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, పెతకంశెట్టి గణబాబు దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. వారి పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించి వేద ఆశీర్వచనం అందజేశారు.

నవమి వేడుకలకు అంకురార్పణ

అట్టహాసంగా రాములోరి పెళ్లిరాట



పరవాడ రామాలయం వద్ద పెళ్లిరాట కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు



వెన్నెలపాలెంలో పూజలు జరుపుతున్న సర్పంచ్ అప్పారావు దంపతులు



ఈ.బోనంగిలో పెళ్లిరాట వేడుకల్లో పాల్గొన్న భక్తులు

పరవాడ: గ్రామాల్లో నవమి ఉత్సవాల సందడి ఆరంభమైంది. జగదభిరాముడి కల్యాణ మహోత్సవంతో పాటు శ్రీరామనవమిని ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. రాములోరి కల్యాణ రాటను పలు గ్రామాల్లో సోమవారం అట్టహాసంగా నిర్వహించారు. ఈ నెల 30న శ్రీరామనవమి మహోత్సవాలను ఘనంగా నిర్వహించడానికి ఉత్సవ కమిటీలు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాయి.

- పరవాడ రామాలయ ప్రాంగణంలో సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు దంపతులు పెళ్లిరాట కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ చుక్క రామునాయుడు, గ్రామ పెద్దలు పైల పోతినాయుడు, రెడ్డి శ్రీనివాసరావు, పోతల అప్పలనాయుడు, సిరపరపు రాజేష్, పైల అప్పలనాయుడు పాల్గొన్నారు.
- ఈ.బోనంగిలో పెళ్లిరాట కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ అట్టా సన్యాసప్పారావు, మాజీ ఉప సర్పంచ్ బుగిడి రామగోవిందరావు, బుగిడి రమణారావు, చందక చంద్రశేఖర్, గోవిందరాజు, కృష్ణ, మురళి, మన్మథరావు, బుగిడి రామ ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.
- శ్రీరామనవమి ఉత్సవాలను పురస్కరించుకొని వెన్నలపాలెంలో సర్పంచ్ వెన్నల అప్పారావు దంపతులు పెళ్లిరాట వేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వెన్నల అరుణకుమారి, పైల సత్యనారాయణ(బొబ్బిలి), పైల రేగారావు, ఎం.ముత్యాలనాయుడు, వెన్నల పెదయ్యబాబు, తదితరులు పాల్గొన్నారు.

కమనీయం .. కల్యాణం



యజ్ఞోపవీతం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ ఆస్థాన మండపంలో ఉదయం 9.30 నుంచి 10.30గంటల వరకు కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

చలో ఢిల్లీని విజయవంతం చేయండి



గోడ పత్రిక ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

పరవాడ: వచ్చేనెల 5న చేపట్టనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ కోరారు. చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ ఫార్మాసిటీలో సోమవారం గనిశెట్టి గోడపత్రిక ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక, రైతు హక్కుల కోసం మార్చ్ టు పార్లమెంట్‌లో పాల్గొవాలని పిలుపునిచ్చారు. మోదీ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. చలో ఢిల్లీ కార్యక్రమంలో వేలాదిగా రైతు, కార్మికులు, కూలీలు పాల్గొని జయప్రదం చేయాలని గనిశెట్టి కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కె.పోతినాయుడు, పి.చిన్నారావు, కె.వెంకునాయుడు, ఎ.రాజా, కె.దారబాబు, సత్తిబాబు, పెంటారావు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీలతో పాటు నైపుణ్యాలూ ప్రధానం



విద్యార్థులనుద్దేశించి ప్రసంగిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: అత్యంత పోటీ ప్రపంచం యువతకు ఆహ్వానం పలుకుతోందని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి అన్నారు. సోమవారం ఉదయం ఏయూ వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో నిర్వహించిన ఈసీఈ విభాగ దినోత్సవాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ నేటి తరం డిగ్రీలతో పాటు నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. అనంత శక్తి విద్యార్థుల సొంతమని, మస్తిష్కంలో ఉద్భవించే ఆలోచనలను ఆచరణలో చూపాలన్నారు. వ్యాపారాత్మక ఆలోచనలు ప్రోత్సహించడానికి యూనివర్సిటీ సిద్ధంగా ఉందన్నారు. సాంకేతికత మార్పులు యువతకు సవాళ్లు విసురుతోందని, వీటికి పరిష్కారాలు చూపే సామర్థ్యాలు విద్యార్థుల్లో పెంపొందించే దిశగా కృషి జరగాలని ఆచార్యులకు సూచించారు. ఆచార్యులు ఆత్మావలోకనం చేసుకుంటూ అసాధారణ పనితీరు, ప్రగతిని చూపాల్సిన అవసరం ఉందన్నారు. ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.శశిభూషణరావు మాట్లాడుతూ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్ ఇంటెలిజెన్స్ రంగాలు భవిష్యత్ సమాజంపై అత్యంత ప్రభావాన్ని చూపుతాయన్నారు. ఈ రంగంలో ఈసీఈ విద్యార్థులు అడుగు పెట్టాలన్నారు. ఏయూ పూర్వ వీసీ ఆచార్య జి.ఎస్.ఎన్.రాజు మాట్లాడుతూ స్టార్టప్, ఇన్నోవేషన్, ఇంక్యుబేషన్ రంగాలలో ఏయూ సాధిస్తున్న ప్రగతి ప్రశంసనీయమన్నారు. జీవీపీ కళాశాల డీన్ ఆచార్య కె.రాజరాజేశ్వరి మాట్లాడుతూ అన్ని రంగాలలో ఏయూ అద్భుతమైన ప్రగతిని చూపుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య కిషోర్‌బాబు, విభాగాధిపతి ఆచార్య పి.రాజేష్ కుమార్, అనిట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీరామకృష్ణ, డాక్టర్ అనూరాధ, డాక్టర అరుణ, డాక్టర్ పి.వి.శ్రీదేవి, ఆచార్య కె.రమాసుధ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోలమాంబ పందిరి రాట ఏర్పాటు



పోలమాంబ ఆలయంలో పందిరి రాట వేస్తున్న ఎమ్మెల్సీ వంశీకృష్ణ తదితరులు

ఆరిలోవ: జీవీఎంసీ 9వ వార్డు సంజయ్‌గాంధీ కాలనీలో పోలమాంబ అమ్మవారి పంచరాత్రి జాతర మహోత్సవాలు ఈ నెల 31న ప్రారంభంకానున్నాయి. వచ్చేనెల 4న అమ్మవారి ప్రధాన పండగ జరగనుంది. ఇందులో భాగంగా సోమవారం అమ్మవారి ఆలయ ఆవరణలో రాటోత్సవం నిర్వహించారు. వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల పాల్గొని ఆలయ నిర్వాహకులు, స్థానిక మహిళలతో కలసి ఉత్సవం రాట వేశారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ స్వాతి, ఆలయం ధర్మకర్త కంచుమూర్తి నాగరాజు, సభ్యులు, పాల్గొన్నారు.

శ్రీకరకచెట్టు పోలమాంబ ఆలయంలో.. ఏయూ క్యాంపస్: శ్రీకరకచెట్టు పోలమాంబ అమ్మవారి వార్షిక జాతరలో భాగంగా సోమవారం పందిరిరాట మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, వెంకటరావు దంపతులు పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ముఖ్వల లక్ష్మి, గేదెల లావణ్య, ఎస్.నూకత్నం, పెదవాల్తేరు గ్రామ సేవా సంఘం సభ్యులు, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ పి.శంకరరెడ్డి, ఈవో సురేష్‌బాబా పాల్గొన్నారు. ఆలయ సంప్రదాయంలో భాగంగా పుట్టబంగారం తీసుకు వచ్చే కార్యక్రమం(దేవర పండగ) సోమవారం నిర్వహించారు. వచ్చేనెల 3న తొలేళ్ల పండగ, 4న అనుపు మహోత్సవం నిర్వహించనున్నారు.

774వ రోజుకు ఉక్కు రిలే దీక్షలు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు ప్రజలందరి ఆస్తి అని, దానిని కాపాడుకునేందుకు ప్రతీ కార్మికుడు పోరాటాన్ని మరింత ఉధృతం చేయాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్ ప్లాంట్ ఆర్చి వద్ద నిరసనలు చేపట్టి సోమవారానికి 774వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో సంస్థకు చెందిన ఎల్‌ఎం ఎం, ఎస్‌బీఎం విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు ఒక తాటిపైకి వచ్చి, కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చినట్‌లైతే విశాఖ ఉక్కుకు సానుకూల స్పందన లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ పాలన వల్ల దేశ ప్రజలు దుర్భర పరిస్థితులను అనుభవిస్తున్నారని, లక్షల కంపెనీలు మూతపడ్డాయని, కార్మికులు పనిలేక రోడ్డున పడ్డారని అన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణలో తగ్గేదే లేదని స్పష్టం చేశారు. ఇప్పటికైనా కేంద్రప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు

29న ఆసరా కార్యక్రమం



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ రాజు

పరవాడ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 29న జరగనున్న వైఎస్సార్ ఆసరా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జెడ్పీటీసీ పి.ఎస్.రాజు పిలుపునిచ్చారు. ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాజు మాట్లాడారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పాల్గొంటారని చెప్పారు. సమావేశంలో రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, ఎంపీడీవో వి.హేమసుందర్రావు, ఏపీఎం కనకం, వీవోఏలు పాల్గొన్నారు.

పది పరీక్షలకు ఏడు కేంద్రాలు

- ఎంఈవో సునీత



పరవాడ: ఏప్రిల్ 3 నుంచి జరగనున్న 10వ తరగతి పరీక్షల నిర్వహణ కోసం మండలంలో 7 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు మండల విద్యాశాఖాధికారి ఎం.సునీత చెప్పారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. మండల పరిధిలో 13 ప్రభుత్వ జెడ్పీ పాఠశాలలు, 7 ప్రైవేటు పాఠశాలల నుంచి 1278 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నారని ఆమె చెప్పారు. వీరిలో 655 మంది బాలికలు, 623 మంది బాలురు ఉన్నారన్నారు. పరీక్షల నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన లంకెలపాలెం, పరవాడ బాలురు, పరవాడ బాలికలు జెడ్పీ పాఠశాలలు, తానాం, వాడచీపురుపల్లి, పెదముషిడివాడ, పరవాడ సుమేధా పాఠశాలల్లో పకడ్బందీ ఏర్పాట్లు చేశామని ఎంఈవో సునీత తెలిపారు.

సమస్యలపై ఎండీయూ ఆపరేటర్ల వినతి



తహసీల్దార్ సత్యనారాయణకు వినతిపత్రం అందజేస్తున్న ఎండీయూ ఆపరేటర్లు

సబ్బవరం: అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యలు పరిష్కరించాలని .. లేని పక్షంలో వచ్చే నెల 1 నుంచి ఎండీయూ వాహనాలు నిలిపివేస్తామని ఆపరేటర్లు స్పష్టం చేశారు. దీనిపై స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో తహసీల్దార్ సత్యనారాయణకు మండలంలోని ఆపరేటర్లు వినతిపత్రం అందజేశారు. ఐసీడీఎస్,ఎండీఎం అమౌంట్‌ను సివిల్ సప్లై కమీషన్ ఈ నెలాఖరుకు వేస్తామన్నారని.. వెంటనే చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆపరేటర్లు గొర్లి సతీష్, కోరుకొండ శివ, గురి ఎర్నినాయుడు,వడిశల దుర్గ, గొర్లి రామునాయుడు,ఎస్. తాతంనాయుడు,వి. వెంకటేష్ ,బి. నాయుడు ఉన్నారు.

ఉద్యోగాలకు 9మంది ఎంపిక



ఎంపికైన వారితో ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి, కంపెనీల హెచ్ఆర్‌లు

సబ్బవరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ యువకులకు సోమవారం జాబ్ మేళా నిర్వహించారు. పరవాడకు చెందిన వై జయంతి ల్యాబ్స్ ఉద్యోగాల భర్తీకి బీఎస్సీ కెమిస్ట్రీ అభ్యర్థులకు క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2020,2021,2022 విద్యా సంవత్సరాల్లో డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులకు ఈ అవకాశం కల్పించారు.క్యాంపస్ ఇంటర్వ్యూలకు 25 మంది హాజరు కాగా వారిలో 9 మంది ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీతాలక్ష్మి తెలిపారు. ఎంపికైన వారిని కంపెనీ హెచ్ఆర్‌లు పి. ప్రభాకర్ వర్మ, శ్రీసత్య సౌమ్య, జేకేసీ కోఆర్డినేటర్ బి. శంకర్ అభినందించారు.

కొండవాలుపై కబ్జాదారుల కన్ను!



అమృతపురంలో ఆక్రమణలకు పాల్పడుతున్న కొండవాలు ప్రాంతం

అడ్డుకున్న రెవెన్యూ సిబ్బందిపై దౌర్జన్యం

సబ్బవరం: మండలంలోని అమృతపురంలో విలువైన ప్రభుత్వ భూములపై కబ్జాదారుల కన్నుపడింది. కొంత మంది ఆక్రమణలకు పాల్పడుతూ పాకలు ఏర్పాటు చేస్తున్నారు. అడ్డుకునేందుకు వెళ్లిన రెవెన్యూ సిబ్బందిపై దౌర్జన్యం చేయడంతో పాటు బెదిరింపులకు పాల్పడుతున్నారు. జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న విలువైన ప్రభుత్వ భూములు కావడంతో అక్రమార్కులు పాగా వేస్తున్నారు. సెంటు రూ. 3 నుంచి 4 లక్షలకు వరకు ధర ఉండడంతో కబ్జాదారులు దశల వారీగా పాకలు,షెడ్‌లు,పక్కా భవనాలు నిర్మాణాలు చేపడుతూ ప్రభుత్వ స్థలాలను కబ్జా చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి :అమృతపురం గ్రామంలోని సర్వే నెంబర్ 303-2లో 55 ఎకరాల్లో కొండ ఉంది. దీని చుట్టూ ఉండే కొండ పోరంబోకు ప్రాంతంలో కొంత మంది పాకలు,షెడ్లు వేసేందుకు ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నారు. అందుకు తగ్గట్టుగా తాటి చెక్కలు సిద్ధం చేసి పాకలు వేసే ప్రయత్నాలు చేస్తున్న వారిని వీఆర్‌ఏ బండ అప్పలనర్సమ్మ అడ్డుకుని ఉన్నతాధికారులకు సమాచారం అందించింది. దీంతో అడ్డుకునేందుకు వెళ్లిన వీఆర్వో జగన్నాథంపై కూడా దౌర్జన్యానికి దిగుతూ బెదిరింపులకు పాల్పడుతున్నారని తెలిపారు.అప్పారావు అనే వ్యక్తి తన ఆధీనంలో ఉన్న సుమారు 2 ఎకరాల భూమిని గతంలో మైనింగ్ కోసం లీజ్‌కు ఇచ్చానని, నష్టపరిహారంగా రూ.40 లక్షలు ఇవ్వాలని లేని పక్షంలో 40 సెంట్లు భూమి తనకు కేటాయించాలని ఎదురు ప్రశ్నలు వేస్తున్నారని రెవెన్యూ సిబ్బంది తెలిపారు. దీనిపై తహసీల్దార్ సత్యనారాయణకు సమాచారం అందించామన్నారు. దీనిపై తహసీల్దార్ సత్యనారాయణను వివరణ కోరగా ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాల్సిన బాధ్యత వీఆర్వోలపై ఉందన్నారు.దీనిపై కలెక్టర్ నుంచి స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయన్నారు. ఆక్రమణకు పాల్పడుతున్నవారిపై క్రిమినల్ కేసులు పెట్టాలని వీఆర్వోలకు ఆదేశించామన్నారు.

ఘనంగా పోషణ్ పక్వాడా కార్యక్రమాలు

- పౌష్టికాహారం ఆవశ్యకతపై పోటీలు
- ఉత్సాహంగా పాల్గొన్న అంగన్‌వాడీలు



మెట్టపాలెం అంగన్‌వాడీలో పోషణ్ పక్వాడాలో పాల్గొన్న సర్పంచ్ వరలక్ష్మి తదితరులు



పరవాడ అంగన్‌వాడీలో..

పరవాడ: మండలంలోని మెట్టపాలెం, పరవాడ, వాడచీపురుపల్లి శివారు దలాయిపాలెం అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం పోషణ్ పక్వాడా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. పౌష్టికాహారం ఆవశ్యకతను వివరిస్తూ ఏర్పాటు చేసిన నమూనాలు ఆకట్టుకున్నాయి. అందుబాటులో ఉన్న వస్తువులతో పౌష్టికాహారం తయారీపై నిర్వహించిన పోటీల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. మెట్టపాలెంలో సర్పంచ్ కూండ్రపు వరలక్ష్మీసీతారామయ్య మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని గర్భిణులు, కిశోర బాలికలకు పోషక విలువలతో కూడిన ఆహారం అందించాలని సూచించారు. చిరుధాన్యాల గురించి వివరించారు. అనంతరం చిరుధాన్యలపై క్విజ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో మెట్టపాలెం జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసరావు, పీహెచ్‌సీ వైద్యాధికారి క్రాంతికుమార్, ఉప సర్పంచ్ రాజాన ముత్యాలు, పంచాయతీ కార్యదర్శి రమేష్, ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

- సబ్బవరం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పరవాడ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడా కార్యక్రమం చేపట్టారు. హైస్కూల్ విద్యార్థులకు చిరుధాన్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మినుములు ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సురేఖ, ఎం.ఎస్. కె.శశికళ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.
- వాడచీపురుపల్లి శివారు దలాయిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో చిరు ,ధాన్యాల వల్ల ఉపయోగాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు దలాయి రాముడు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

దాసరి రాజుకు ఘన నివాళి



దాసరి రాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి అమర్‌నాథ్, ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సింహాచలం: జీవీఎంసీ 93వవార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, దివంగత దాసరి రాజు పెద్ద కర్మ సోమవారం ప్రహ్లాదపురంలోని ఆయన స్వగృహం వద్ద ఘనంగా జరిగింది. రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జి, 93, 94వ వార్డుల కార్పొరేటర్లు రాపర్తి కన్నా, బల్ల శ్రీను, వైఎస్సార్‌సీపీ 94వవార్డు అధ్యక్షుడు ఆదిరెడ్డి మురళి, జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు తదితరులు రాజు చిత్రపటానికి పుష్పాలు వేసి నివాళులర్పించారు. దాసరి రాజు కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

ఆలయ పునర్నిర్మాణానికి భూమి పూజ



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తదితరులు

సబ్బవరం: సబ్బవరంలో కొలువైన ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా సోమవారం శంకు స్థాపన చేశారు. రేజేటి శ్రీరామాచార్యులు పర్యవేక్షణలో వేదపండితులు శాస్త్రోక్తంగా ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్‌తో భూమి పూజలు నిర్వహించారు. సుమారు రూ.కోటితో ఆలయ నిర్మాణం చేపట్టనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు, ఎంపీపీ బోకం సూర్యకుమారి, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ, సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కర్రి బాబు, వీఆర్వోల సంఘం జిల్లా అధ్యక్షుడు సబ్బవరపు త్రినాథ రామకాసు, ఉప సర్పంచ్ మండల లక్ష్మణతో పాటు ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఇంట్లో చోరీ

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో చోరీ జరిగింది. వివరాలిలా ఉన్నాయి. వివేకానంద వీధిలో నివసిస్తున్న పిళ్లా రమణ, చినతల్లి దంపతులు శుక్రవారం నేపాల్ పర్యటనకు వెళ్లారు. శనివారం వారి ఇంటికి ఓ బంధువు రాగా ఇంటి తాళంతో పాటు బీరువాలో లాకర్ తెరిచి కనిపించింది. గాజువాక క్రైం పోలీసులు ఆదివారం ఇంటిని పరిశీలించారు.